# గమ్యం

"సాల్ సాలక్కా! మొగుని మాటొద్దు! నేబోతా!" నాగమ్మ లేచి నిలబడింది.

"నా మాటినక్కా" రమ ఏమో చెప్పబోయింది. నాగమ్మ వినే స్థితిలో లేదు.

నాగమ్మ రమకంటే పదేళ్ళు చిన్నది. నాగిరెడ్డికి నాగమ్మ పెద్ద భార్య, రమ చిన్న భార్య. నాగిరెడ్డి రెడ్డి కాడు. వాళ్ళ అప్పరెడ్డి. రెడ్డంటే రెడ్డి కాడు. మునసబు.

నాగిరెడ్డి పల్లె విడిచి వచ్చాడు. రెడ్డి పదవీ అక్కడే ఉండి పోయింది. నాగమ్మా అక్కడే నిలబడి పోయింది.

అతను పట్నం వచ్చేడు. కాంట్రాక్టరు పదవి వచ్చింది, రమ తోడయింది.

"పెద్ది పెల్లానికి బిడ్డల్లేకపాయె. అందికే రొండో పెల్లి" అతను సంజాయిషీ ఇచ్చాడు.

పెళ్ళప్పుడు నాగమ్మకు పన్నెండేళ్ళు ఈడేరింది. మూడేళ్ళ దాకా పిల్లల్లేరు.

రమకు పెళ్ళినాటికి పాతికేళ్ళు. మూడేళ్ళు అప్పటికే ఉద్యోగం చేసింది. కాలేజీలో లెక్చరరు.

నాగమ్మ. నాగిరెడ్డి అక్క కూతురు. అయిన సంబంధం. అక్కపోరు. పదో తరగతి పాతికేళ్ళ దాకా పడేసి పడేసి తిరగేసి బోర్లేసి తన్ని తన్ని అలసిపోయిన నాగిరెడ్డికి అక్క, కూతుర్ని కట్టబట్టింది. పెళ్ళితో నాగమ్మ చదువు ఆటకెక్కింది.

నాగిరెడ్డి మడిదున్నలేడు. చేను సాగుచేయలేడు. వానల్ని నమ్మలేడు. పంట పెట్టలేడు, రైతు కాదు.



సదువు సట్టుబండలాయె. ఉద్యోగం రాదు. పల్లె సాగనంపె, పట్నం పిలచకపోయె. రెంటికీ చెడ్డాడు. పల్లెలో ఉండలేడు. పట్టణంలో చోటు లేదు.

కానీ, అయ్యేదేదో అయితాదని పట్టణంలోకి మకాం మార్చడు. అబ్బో అనంతపురవంటే, మాటలా అయిదావల్ల ఊరు.

నాగమ్మ నాగిరెడ్డిని సతాయించి పట్నం వచ్చింది. ఎటు చూసినా ఊరే ఉంటే ' యిదేం పూరో' అనుకొనింది.

గణేశ్ పార్క్కు తీసుకు పోయాడు. టెంకాయ కొట్టింది. టవరు క్లాకు చూపించాడు. ప్రదక్షిణం చేసింది. పార్క్కు తీసుకుపోయాడు చెట్టులేలే - అన్నీ మొక్కలు అని తిరిగి వచ్చింది.

అనంతపురం నాగమ్మకు బలే బాగుంది. ఎప్పుడూ చూడలేదు. పూలు కొన్నాడు. పెట్టుకొంది. సుక్కరటి తీసుకొన్నాడు.తింది రఘువీర్‌కుపోయారు. సినిమా చూసింది. హోటల్లో అన్నం తినిపించాడు. తిండి. ఉండిపోతానంది. పల్లెకెళ్ళి పొమ్మన్నాడు. మారాం చేసింది. మంకుపట్టు పట్టింది. నాగిరెడ్డి ఆ మాటవినలేదు. టిక్కెట్టు కొని బస్సెక్కించాడు పల్లెకు వెళ్ళింది. మళ్ళీ రాలేదు.

చిన్న పని లేదు. పెద్ద పని లేదు. అన్ని పనులూ చేశాడు. నాగిరెడ్డి పల్లె నుంచి పైసా అడగలేదు. కాయకష్టం చేసి బతుకుతున్నాడు. అప్పుడే కాంట్రాక్టరు అయ్యాడు.

రోడ్డు కాంట్రాక్టు పనిలో కంకర తోలిచ్చాడు. ట్రాక్టరు వెళ్ళిపోయింది. చీరె కనిపించింది. మంచి చీరె, బాగుంది. నాగమ్మకయితే బాగుంటుంది.

చీరె బాగుంది. చీరెకట్టుకొన్న మనిషి చూడాలి. చూడవచ్చునా, చూద్దాం, చూశాడు.

కళ్ళు తిరిగాయి. చెమట పట్టింది. జ్వరం వచ్చింది. అచ్చంగా సినిమా స్టారు. ఏం ఫిగరు. ముఖం చూశాడు. నవ్వుతూ ఉంది.

నాగిరెడ్డికి వణుకు పుట్టిన మాట నిజం మగాడు కదా, వణక కూడదని వణకలేదు. కానీ, లేకపోతే దిక్కులేకుండా వణికిపోయే వాడే! ఏ మాటకామాటే చెప్పుకోవాలి. చదువబ్బ లేదు కానీ అతడికి తిండి వంటబట్టింది. కంకరలో దుమ్ములో ధూళిలో తిరక్కపోతే తీరైన బొమ్మే. గోచిపెట్టి జుబ్బా వేస్తే ఎంటీ రామారావు ఏమూల కబురు?

చీరె బస్సు దిగటం చూశాడు నాగిరెడ్డి. చీరె బస్సెక్కటం కోసం కాపు కాశాడు. అనుకొన్నట్లే చీరె రోడ్డు మీద దొరికింది. దొరికింది కదా అని నవ్వాడు. వణికిపోతుందనుకొన్నాడు. వణకలేదు. పైగా నవ్వింది. నాగిరెడ్డికి వణుకు ప్రారంభమయింది. కాళ్ళ కింద నేల జారిపోతూ ఉంది. తూలి పడబోయి, నిలదొక్కు కొని, నిలబడి 'యాఁవయితే అదే అయితాద'ని తీరుబడిగా నవ్వి తడబడి పారపడి నవ్వి, నిలబడి, తనలో తాను కలబడి నవ్వి, వెనుకబడి ఎదురుపడి నవ్వాడు.

ఎదురుగా నవ్వు, రెండు నవ్వులూ ఢీకొన్నాయి. నాగాస్త్రం నారాయణాస్త్రం గుద్దు కొన్నట్లయింది.

రూలు ప్రకార్ం అక్కడ రోడ్డులేదు. బస్సు ల్లేవు. మనుషులు లేరు. రాకపోకలు లేవు. అనంతపురమేలేదు. వాళ్లిద్దరే ఉన్నారు.

ఇంక రామాయణం ఎందుకు? రాముడూ లేడు, సీతా లేదు. నాగిరెడ్డి ఉన్నాడు. రమ ఉంది.

రమ బస్సెక్కితే కాలేజీ, బస్సుదిగితే ఇల్లు. ఒక్కతే! వండేదీ తనే! తినేదీ తనే! తోడు లేదు.

నాగిరెడ్డి గాలివాటం చూశాడు. రమ నడక చూశాడు. నడత చూశాడు. బస్సెక్కాడు. పల్లెకు పోయాడు. ఇల్లు చేరాడు. నాగమ్మతో చెప్పాడు.

"రెండో పెళ్లి"

"హూఁ"

"నువ్వేఁవంటా?"

"హూఁ"

నాగమ్మ ఒప్పుకొంది. ఏం ఒప్పుకొంది?తెలియదు. ఎందుకు ఒప్పుకొంది? తెలియదు. ఫలితం? తెలియదు.

మూడో రోజు పెళ్ళి రిజిస్ట్రారు.ఆఫీసులో నాగమ్మ సాక్షి.

ఇక రమ ఇంట్లో నాగిరెడ్డి. పల్లెలో నాగమ్మ. వెర్రి నాగమ్మ.

అక్కకు తెలిసింది. అల్లాడి పోయింది. నాగమ్మ జుట్టు పీకి పోగులు పెట్టింది. పట్నం వచ్చింది. నాగిరెడ్డిని పట్టుకొంది. నానా శాపనార్థాలూ పెట్టింది. తిట్టింది. బెదిరించింది. ఏం లాభం? చేతులు కాలాయి. ఆకులేవు!

రమ మూసిన పుస్తకంలాగా కూర్చుంది. నాగిరెడ్డి కంకర ట్రాక్టరులా వెళ్లిపోయాడు.

నాగిరెడ్డికి కాంట్రాక్టరు బుద్ధులు వచ్చాయి. రోడ్డు మీదికి పోతాడు. జమ చేస్తాడు. ఇంజినీరును కలుస్తాడు. లంచమిస్తాడు. పల్లెకు పోతాడు. నాగమ్మను పలకరిస్తాడు. పట్నం వస్తాడు. రమ ఇంట్లో ఉంటాడు. గడియారంలో తాను సెకండ్ల ముల్లు, రమ నిమిషాలు, నాగమ్మ గంటలు.

నాగమ్మకి కష్టం తెలిసిరాసాగింది. ఏడ్చింది. ఏం లాభం? ఇప్పుడేం చేస్తుంది? ఇదేం ధర్మమని ప్రశ్నించింది.

నాగిరెడ్డి ఆ దెబ్బతో ధర్మమూర్తి అయిపోయాడు. పల్లెలో రెండు రోజులు. పట్నంలో అయిదు రోజులు. వారం గడచీ పోతుంది. యాభై రెండు వారాలు , సంవత్సరం గడచిపోతుంది.

నాగమ్మ ఎప్పుడయినా పట్నం వెళ్తే రమ ఇంటికి పోదు. రమ పల్లెకు వచ్చి నాగమ్మతో కబుర్లు చెబుతుంది.

లలిత కళా పరిషత్తులో చీరెల బేరమాడుతున్న నాగమ్మ, రిక్షాలో సినిమాకు పోతున్న భర్తనూ, సవితినీ చూసింది. ఎవరో గిల్లినట్లు అనిపించి చుట్టూ చూసింది. ఎవరూ లేరు. గిల్లలేదు. గిల్లటం బైటకాదు. లోపల, గుండెలో కలుక్కుమంది.కళ్ళలో నీళ్ళు పొగపెట్టినట్లయింది. పొగలేదు, నీళ్ళు ఉన్నాయి. నీరు పల్లమెరుగు. కనిపించిన కన్నీళ్ళు కనిపెంచిన కళ్ళను వదలి చెక్కిలి మీదికి ఉత్తబిత్తలతో ఉరికి పోరాడుతున్నాయి. ముక్కును తాకి, చెక్కిలి తాకి, మూతిని తాకి దిక్కులు చూస్తున్నాయి కన్నీటి బొట్లు.

నాగమ్మకు ఏవో కోరికలు. లోకం తెలియదు. అన్నీ అర్థంకాబట్టాయి. సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి, చీకటి, వెన్నెల తెలుస్తున్నాయి. పల్లెకు వచ్చిన నాగిరెడ్డితో, ఒక రాత్రి వేళ మెలకువ వచ్చిన నాగమ్మ, మేల్ నే ఉన్న మనిషితో మాటలు పెట్టుకొంది.

సినీమా చూసి, తిరిగి పల్లెకు వచ్చిన తరువాత అన్నం తిని పడుకొన్నప్పుడు ఆమె భర్తను అడిగింది. "నన్నేల రిచ్చాలో తీసకపోలా?"

నాగిరెడ్డి ఏమీ మాట్లాడలేదు. అప్పుడు నాగిరెడ్డి ముఖం ఎలా ఉంటుందో పాడు చీకటి ఏమీ కనిపించలేదు. ఎంతకీ జవాబు లేదు. అందుకే మళ్ళీ మాట్లాడించింది.

"ఏల దండగ?" అన్నాడు.

నాగమ్మకు అర్థం కాలేదు. కొంచెం అర్థమయింది. దండగని తెలిసింది. వృథా ఖర్చు అని అర్థం చేసుకొంది. గుండెలో కలుక్కుమంది. లోపల పొగ, కన్నీళ్ళు.

సంక్రాంతి పండక్కి, బట్టలు కొనటానికి నాగమ్మను తీసుకొని వచ్చాడు. అనంతపురంలో షాపులన్నీ చుట్టినారు. చివరకు కొనుగోలు చేశారు. రెండు పాకెట్లు.

"ఇది నాకు" అంది నాగమ్మ

"కాదు, నీకు అది" అన్నాడు నాగిరెడ్డి

"మడిది?" అది

"రమకు!"

రమకు విలువైన బట్టలు, తనకు మామూలువి, ఇదన్యాయం. పెద్ద భార్య తనకు నచ్చినవి తీసుకొంటుంది. మిగిలినవి చిన్న భార్య తీసుకోవాలి. అదీ రూలు.

ఆమె గుండె కలుక్కుమంది. లోపల పొగ ఎక్కడో బూడిద కడుపులో మంట. కళ్ళలో నీళ్ళు.

"లెక్కెంత?" అడిగింది.

"లెక్క కావల్లా! లెక్క" విసుక్కొన్నాడు.

నాగమ్మలో ఏదో మార్పు రాసాగింది. "పల్లెలో ఇంక ఉండేదిలే. పట్నం వచ్చేకి రెడీ" అంది. వద్దంటే ఉల్లేదంది. తప్పలేదు.

ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు. రెండిళ్లు, నాగమ్మ బేరం పెట్టింది. "నాలుగు రోజులుండాల్ల' ' బేరం ఖాయమయింది - " మూడు రోజు లీడ. నాల్రోజులాడ."

శుక్ర, శని, సోమవారాలు నాగమ్మజమ. శుక్రవారం కూలీ బట్వాడా, శనివారం ఆఫీసుల పని. సోమవారాలు కొత్త కాంట్రాక్టులు రోజంతా ఉండడు. రాత్రి మాత్రమే వస్తాడు.

మిగతా రోజులు రమ జమ. ఆమె పగలంతా ఉండదు. సాయంకాలం వస్తుంది. ఆమె కోసం నాగిరెడ్డి ఎదురు చూస్తుంటాడు. ఆదివారాలు, సెలవురోజులు అన్నీ రమతోనే, నాగమ్మకు పండగలేదు. పబ్బంలేదు. ఉంటే ఒంటరిగానే.

శుక్రవారం సాయంకాలం నాగిరెడ్డి ఒంటరిగా ఉంటాడని రమ ఇంటికి పోయింది నాగమ్మ.

కూరగాయల సంచితో నాగిరెడ్డి ఇంట్లోకి పోవటం నాగమ్మ చూసింది. నమ్మలేక పోయింది.

సంచినిండుగా కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, ఆలుగడ్డలు, తెచ్చి టేబిల్ మీద పోసి వేరు చేస్తున్నాడు. ఈ పనులు చేస్తున్నాడా!! ఎప్పుడైనా చేశాడా? నాగమ్మకు ఉండ బుద్ధి పుట్టలేదు. పలకరించలేదు. రమ ఇంకా రాలేదు. వెనుదిరిగింది. చెప్పరాని దిగులు మంట, పొగ, కన్నీళ్ళు.

నాగమ్మ వీథిలోకి వచ్చిన కూరగాయలు కొంటుంది. ఎప్పుడైనా మార్కెట్టుకు పోయి తెచ్చుకొంటుంది. తనింటికి నాగిరెడ్డి ఎప్పుడూ మార్కెట్టు నుంచి కూరగాయలు తేలేదు. ఎప్పుడైనా కూరాకు తెచ్చేవాడు. ఇప్పడదీ లేదు. కూరాకు మసాలా వేసి చేయటం, తినటం ఆమె కిష్టం. నాగిరెడ్డి తేవటం లేదు. తాను తినటం లేదు. ఎప్పుడూ ఒకటే వంకాయ, రాయిదుర్గం వంకాయ, ఏనుగంత ఉంటుంది. వల్లమాలిన వాతం, సయ్యూసారం ఉండదు. నాగిరెడ్డి సంచి మోయటం చూడలేక పోయింది. చూసి నమ్మలేకపోయింది. వెనుదిరిగి వస్తూ ఉంది. మంట, పొగ, కన్నీళ్లు.

భర్తకు ఉదయం నుంచి రాత్రి దాకా అన్ని పనులూ చేసేది నాగమ్మ. గెడ్డం గీక్కోవాలంటే తాను సరుకూ సరంజామా అందివ్వాలి. పళ్లు తోముకోవాలంటే అన్నీ అందుబాటులో ఉంచాలి. నీళ్ళు కాయించాలి. తోడాలి, తొరపాలి, వొళ్ళు తోమాలి. స్నానం చేయించాలి. వొళ్ళు తుడవాలి. అన్నీ తనేచేయాలి. స్నానమయినా అంతే! పానమయినా అంతే! తాను కాళ్ళు ఒత్తితే తప్ప నిద్ర కూడా పోడు.

భర్త మారిపోయాడు. కూరగాయలు తెస్తున్నాడు. గెడ్డం గీక్కుంటున్నాడు. ముఖం కడుక్కుంటున్నాడు. పళ్ళు తోంకొంటున్నాడు స్నానం చేస్తున్నాడు. అన్నీ తనే చేస్తున్నాడు, రమ ఏమీ చేయదు, ఏమీ అందియ్యదు. ఏమీ తోడు పడదు, ఎంత మార్పు.

అన్నీ సమకూర్చేది నాగమ్మ.

ఏ పనీ చేయదు రమ.

మొక్కుబడిగా నాగమ్మ దగ్గరుంటాడు. మోహంతో రమ దగ్గరుంటాడు నాగిరెడ్డి. రమ చిన్నదీ చితకదీ కాదు. నాగమ్మ కంటే పదేళ్లు పెద్దది. ఏం కారణం? అంతుబట్టలేదు. ఏం చేస్తుంది? ఏం చేయగలదు? గిల్లిన ఆచూకే! గిచ్చిన అనవాలు, గీకినట్లు మంట, లోపల పొగ, బయట కన్నీళ్ళు.

పొట్లికూర తిని కొన్ని నెలలే అయినా సంవత్సరాలు గడచినట్లుంది నాగమ్మకి. తినాలనిపించింది. సిగ్గనిపించింది.తింటున్న కూడు కూడులాగా లేదు. ఇంట్లో ఉండబుద్ధి పుట్టటం లేదు. ఏమీ తోచటం లేదు. మానం విడిచిరమ ఇంటికి పోయింది.

భర్త, తన భర్త తన సొంతభర్త బంగారం లాంటి భర్త రమకు కాఫీ తెచ్చి ఇచ్చాడు. కళ్ళార చూసింది నాగమ్మ, నమ్మలేకపోయింది. వెనక్కి పోలేదు. ముందుకే పోయింది. లోపలికి వచ్చింది.

రమ కాఫీ తీసుకొని తాగుతూ ఉంది. "నాకు గాని కాఫీ కావల్ల" అంది నాగమ్మ నాగిరెడ్డి లేవలేదు. అతనే తనకూ కాఫీ ఇవ్వాలని నాగమ్మ అభిప్రాయం. కానీ భర్త వంటగది చూపించారు.

"తే నీకేమి?" ప్రశ్నించింది.

"నవుకర్లు లేరు!" చెప్పాడు

నాగమ్మకు తన ఉనికి తెలిసింది. తన స్థానం అర్థమయింది అసహ్యంగా ఉంది. తన మీద తనకే కోపం.

రమ పరిస్థితి గమనించింది. పరువు దిగింది. చెప్పులేసుకొంది. వంటగదికి పోయింది. వంట గదిలో చెప్పుల కాళ్ళు,

నాగమ్మ చూడలేకపోయింది.

కప్పు నిండా కాఫీ, కమ్మని కాఫీ. నాగమ్మకు రుచిగా లేదు. చేదుగా ఉంది.

నాగమ్మనూ, ఖాళీ కప్పునూ తీసుకొని రమవంట గదిలోకి పోయింది.

నాగిరెడ్డి కాఫీ తాగలేదు. తాగటానికి లేదు. ఉన్న నోరు తెరిచాడు. తెరిచిన మాట మరిచాడు. దిక్కులు చూస్తూ ఉండి పోయాడు.

రమ వండింది. వార్చింది, వడ్డించింది. నాగమ్మ తృప్తిగా తింది. టి.వి. చూచింది. రేడియోవింది. ఫేన్ కింద కూర్చుంది. పరుపు మెత్తగా ఉంది. కుర్చీలు షోగ్గా ఉన్నాయి. డైనింగ్ టేబిల్ దర్జాగా ఉంది. ఇల్లు రమ వళ్ళు లాగా నిగనిగలాడుతూ ఉంది.

పాలు పోసే సాలక్క నాగమ్మను చూసింది. " మీ పాపా! బాగుంది" అంది "అలంకరిస్తే మీ కంటే షోగ్గా ఉంటుంది" అంది. "సన్నదాయ సలాకీగా ఉంది" అనీ అంది. "ఒక్క తల్లి పిల్లల్లో ఎంత తేడా! ఎంత అందం అంటూనే ఉంది. రమ అవునంది. కాదంది. కాదూ అంది. కాదే అనుకొంది కాదు, కాదు అనేసింది.

నాగమ్మ తన ఇంట్లో నాగిరెడ్డి భోజనం చేస్తున్నప్పుడు విసనగర్ర విసురుతూ, రమ ఇంట్లో వస్తువులు గుర్తుకు తెచ్చుకొని "కొనుక్కొందాం" అంది "లెక్కేది?" అన్నాడు. కసురుకొన్నాడు ఎందుకు దండగ అనలేదు. "ఉన్నప్పుడు" అంది నాగిరెడ్డి ఊఁ అనలేదు. కాంట్రాక్టు పని బాగా కలిసివచ్చింది. మోటారు సైకిల్ కొన్నాడు. కాలేజీలో దించటం, తీసుకు రావటం రెండూ చేస్తున్నాడు. అంతేకాదు, నాగమ్మ ఈ మధ్య చాలా తెలుసుకొంది.

నాగిరెడ్డి కాఫీ కాస్తాడు. వంట చేస్తాడు. మంచం వేస్తాడు. రమ కాల్లు వొత్తుతాడు. చేయరాని సేవలు చేస్తున్నాడు. భరించలేక పోయింది నాగమ్మ ఒక చోట సేవలు చేస్తాడు. మరో చోట చేయించుకొంటాడు. తేడా నాగమ్మకు అర్థం కాలేదు.

నాగిరెడ్డి హుషారుగా ఉన్నప్పుడు తనకు నెలతప్పిన విషయం నాగమ్మ భయం భయంగా, సిగ్గు సిగ్గుగా చెప్పింది. అతను పలకలేదు. ఉలకలేదు మళ్ళీ చెప్పింది. విని "నీకూ యాగిట్లా?"

ఆమెకు అర్థం కాలేదు. అంటే ఏనిటి అనుకొంది. అతను సంతోషంగా లేడని మాత్రం

తెలిసింది. ఆరోజుల్లోనే రమకు నెల తప్పిందని మహా ఉబలాటంగా నాగిరెడ్డి చెబుతుంటే ఆమె వినలేక పోయింది. అతడి సంతోషం అంగీకరించ లేకపోయింది. అది భరించలేదు. అసహ్యం.

వ్యథ కలిగింది. కోపం వచ్చింది. అతణ్ణి కోపించి తానేమీ సాధించలేదు. రమను అసహ్యించుకొని తానేమీ అందలాలెక్కలేదు.

మొగుడు ఇద్దర్నీ సమంగా చూడవద్దూ! చూడాలి. చూడటం లేదు. అదే కడుపుమంట, కబురు లేదు. నాగమ్మ కష్టపడి, అలంకరించుకొని రమకంటే అందంగా తయారయింది. అయినా ప్రయోజం లేదు. తల్లి వచ్చి ఇల్లూ వాకిలీ అన్నీ సమకూర్చి షోగ్గా తీర్చిదిద్దింది. కానీ ప్రయోజనం లేదు.

నెలలు నిండిన కూతుర్ని పుట్టినింటికి తీసుకొని పోతానంటే సరేనన్నాడు. సొంత అక్కతో మరో మాట మాట్లాడలేదు. పుట్టింటికి పోయే ముందు భయంగా ఉందంది. నాగమ్మ. అతనేమీ మాట్లాడలేదు.

నాగమ్మది ధర్మ ధైర్యం. అతణ్ణి నిలదీసింది. "అక్కనేల అంతిదిగా జూత్తా" వంది.

నాగిరెడ్డి చుట్టూ చూశాడు. "నీకేం?" అన్నాడు. "అది మాకత" అన్నాడు. "మామాటేల? నీ మానాన నువ్ బో" అన్నాడు. చిర్రుగా చూసింది. "యాంలే!" అని, 'లెక్క' అనీ, 'జీతం' అనీ 'సదువు' అనీ అన్నాడు.

ఆమె గుడ్లు తేలేసింది. పిండం ఊడిపడుతుందేమోనని భయపడింది.

పల్లెకు పోయిన రోజే అటకెక్కిన పదో క్లాసు పుస్తకాలను చంకకెత్తుకొంది. దుమ్ము దులిపింది. కళ్ళకద్దు కొంది. మొక్కుకొంది.

కాన్పు అయ్యే రోజులని కబురు చేసినా అతను రాలేదు. పల్లె వైపు కన్నెత్తి చూడలేదు. కబురు లేదు.

కూతురు పుట్టిందని చెప్పినా రాలేదు. చూడలేదు ఏమీ తేలేదు, ఇవ్వలేదు.

ఒకరోజు ఉన్నట్టుండి పల్లెలో ఊడిపడ్డాడు. నాగిరెడ్డి. మడమలు తొక్కుతూ ఉరికాడు. రమ కొడుకును కన్నదని వచ్చే పోయే వాళ్ళకు వరుస పెట్టి చెప్పేడు. చాటింపు వేయించాడు. దండోరా వేశాడు. ఆ ఉరుకులు పరుగులు ఆమెకు అర్థం కాలేదు.

కొడుకు పుట్టాడని చెప్పటానికే వచ్చాడు. కూతుర్ని చూడటానికి రాలేదు. వచ్చాడు

కాబట్టి కూతుర్ని చూశాడు. ఒక పలకరింపు లేదు. ఇకిలింపు లేదు. సకిలింపు లేదు. నాగమ్మకు దిక్కులన్నీ ఉండవలసిన చోట ఉన్నట్లుగా లేవనిపించింది.

బిడ్డనొక చేత్తో, పుస్తకాలనొక చేత్తో అనంతపురం మోసుకొచ్చింది నాగమ్మ.

నాగిరెడ్డి పిల్లలిద్దర్నీ తేడా చూడటం నాగమ్మ తెలుసుకొంది. ఏం తెచ్చినా పిల్లలిద్దరికీ సమంగా రమ తేవటం ఆమె గ్రహించింది.

ఆమెకిప్పుడు కన్నీరు రావటం లేదు. పొగ లేవటం లేదు. మంట పుట్టటం లేదు. తేడాలు తెలుస్తున్నాయి.

వాడు మగపిల్లవాడు. ఇది ఆడపిల్ల, వాడు రమ కొడుకు, ఇది నాకూతురు, రమ ఉద్యోగి, తాను నిరుద్యోగి. రమ విద్యావంతురాలు, తాను చదువులేని దద్దమ్మ. ఆమెకు జీతం వస్తుంది, తనకు లెక్కలేదు. ఆమె అతణ్ణి పోషిస్తుంది, అతను తనను పోషించాలి.

ఆమె టెన్త్‌కి ఫీజు కట్టిందంటే "పొసుకాటం మాటలా?" అని ఊరుకొన్నాడు. తన అనుభవం తనకే సొంతం.

అతనామెను చూడటం లేదు. రాకపోకలు ఆగిపోయాయి. హక్కూ వాడుకోవటం లేదు. బాధ్యతా నెరవేర్చటం లేదు. భద్రతా కల్పించటం లేదు. నాగిరెడ్డి దూరమవుతున్నాడని తెలిసి కుమిలి పోయింది. ప్రయత్నించింది. ఫలితం లేదు.

కొడుకు పుట్టిన రోజు బాగా జరిగింది. ముందుగా కూతురు పుట్టిన రోజు జరిగి ఉండాలి. జరగలేదు. బాబుకు మంచి బట్టలు వేశారు. కూతురికీ మంచి గౌను తొడిగారు. ఇద్దరూ మాట్లాడుతున్నారు నవ్వుతున్నారు నడుస్తున్నారు.

నాగిరెడ్డి మురుసుకోలేదు. ముచ్చట పడలేదు, పలకరించలేదు, చూస్తూ కూర్చోలేదు. విసురుగా వెలుపలికి వెళ్ళిపోయాడు.

"ఇంటర్ ప్రవేటుగా రాస్తే మేలు" రమ సలహా ఇచ్చింది "కాదు కాలేజీలో చేరతా!" "బిడ్డ!" "దానవ్వకిత్తా" "మా కాలేజీ మేలే!" "ఈవూరుకీడే" " మడి?" " మా ఊరే!" నాగమ్మ నిశ్చయం రమకు అర్థమయింది.

"మొగుడు ?" రమ అడిగింది.

"సాల్ సాలక్కా మొగునితో కాపురం!" రమ వింతగా చూసింది. "వదిలేత్తా నీకు నీకే' " మడినీకు?" "నాకొద్దు". రమ వణికింది."కడుపేతా?" " కాదు" , యాఁవయిందే

నీకు?" నాగమ్మ ఏడ్చింది. "నీగ్గాని దెయ్యం పట్టిందా?" "లేదు".

రమ ప్రేమ అర్థమయింది. సొంత అక్కలాగా మాట్లాడింది అదే ఆమె ఆనందం.

"నే పోవల్ల!"

" పోదువులే, కూసో!"

"కూకునేకి రాలా!"

బిడ్డ నెత్తుకొంది. లేచింది. ముందుకు సాగింది. నడుస్తూ ఆగింది. "ఒక్కటడి గేదా?" " అడుగు వద్దంటినా?"

నాగమ్మ రమకళ్ళలోకి చూసింది. "నాక్కోపం(వ్)లే దిగుల్లే .పగల్లే దగ్గరకుపోయి భుజం మీద చేయి వేసి " నీ మొగుని పల్లెకు రానీయక!" అంది.

నాగమ్మ నిక్కచ్చిగా చెప్పింది. "నన్నాడు పిలిచేకి లేదు. తలచేకి లేదు" ఆగింది "వస్తే పేణ్ణీళ్లే పొరకేట్లే మెట్టేట్లే." ముఖం కందిపోయింది.

"అక్కా రమక్కా, నీకాళ్ళకు మొక్తా నాకీ సాయం సేయి." రమ నోరెత్తలేదు.

నాగమ్మ మెట్లు దిగింది. చంకలో బిడ్డ, భుజం మీద పుస్తకాలు ఎదురుగా నాగిరెడ్డి వస్తున్నాడు. నాగమ్మ వెళుతూ ఉంది. ఎందుకో " నాగమ్మా!" అన్నాడు, వినలేదు "నాగా!' ' అన్నాడు. పలకలేదు "ఆగు" అన్నాడు ఆగలేదు. "నిన్నే...." అన్నాడు చూళ్ళేదు. "మాట' ' అన్నాడు. నిలబడలేదు. "యావయిందినికి?"అన్నాడు. ఎవరూ పలక లేదు. రమకళ్ళలో దిగులు, నాగిరెడ్డి కళ్ళలో కోపం. నాగమ్మ కళ్ళలో ఆనందం.

సరళరేఖలాగా సాగిపోతూ ఉంది నాగమ్మ పల్లెకు, కాలేజీకి, భవిష్యత్తుకు.

★